క్లుప్తంగా

హైందవ సంప్రదాయాలను గౌరవించాలి


ఉపన్యసిస్తున్న రామానందభారతి

తోటపల్లిగూడూరు: హైందవ సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని విశాఖపట్నంలోని భువనేశ్వరి పీఠాధిపతి రామానందభారతి సూచించారు. మండలంలోని జ్వాలాముఖి అమ్మవారి ఆలయానికి శుక్రవారం ఆయన విచ్చేశారు. ఈఓ తాతా శ్రీనివాసరావు, పండితులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హైందవ ధర్మంపై ఉపన్యసించారు. నేతలు కోడూరు శ్రీనివాసులురెడ్డి, సోమన శ్రీనివాసులురెడ్డి, కావల్‌రెడ్డి సురేంద్రరెడ్డి, జలదంకి హరి, కర్పూరం శ్రీనివాసులు, వేణు తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



మనుబోలు: మనుబోలులోని శివాలయంలో ప్రత్యేక పూజలను శుక్రవారం నిర్వహించారు. పంచామృతాభిషేకాలను అర్చకుడు ఫణీంద్ర శర్మ ఆధ్వర్యంలో జరిపారు. ఆలయం వద్ద అన్నప్రసాదాన్ని మధ్యాహ్నం అందజేశారు. ఉభయకర్తగా ఆమంచర్ల సుధాకర్‌రెడ్డి వ్యవహరించారు.

కాలువల్లో పూడికతీత పనులు



మనుబోలు: మండల కేంద్ర పరిధిలోని సాగు నీటి వాగులు, కాలువలకు మహర్దశ పట్టింది. కండలేరు ఉప కాలువలు, పంట కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో పాటు పిచ్చి మొక్కలు, తుంగ పెరిగి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో కాలువల్లో పూడికతీయడంతో పాటు నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న పిచ్చి మొక్కలు, కాలువ అంచున ఉన్న గడ్డిని జేసీబీలతో తొలగిస్తున్నారు.

భగత్‌సింగ్ కాలనీలో కార్డన్ సెర్చ్


స్వాధీనం చేసుకున్న బైక్‌లు

నెల్లూరు సిటీ: నగరంలోని భగత్‌సింగ్‌కాలనీలో కార్డన్ సెర్చ్‌ను నవాబుపేట పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్పీ ఆదేశాలతో స్పెషల్ పార్టీలతో కలిసి సుమారు 35 మందితో ఆపరేషన్‌ను జరిపారు. సుమారు 400 ఇళ్లలో తనిఖీలు చేపట్టగా, సరైన పత్రాల్లేకపోవడంతో 15 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా, ఎస్సై రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారంలో విఫలం



నెల్లూరు(బృందావనం): రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి సుందరరామరాజు ఆరోపించారు. పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ మందిరంలో శుక్రవారం నిర్వహించిన ఏఐకేఎస్ రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో రాష్ట్రంలో రైతుల పరిస్థితి నానాటికీ దిగజారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతు సంక్షేమం కోసం ఏఐకేఎస్ జాతీయ మహాసభలను బిహార్ రాజధాని పట్నాలో డిసెంబర్ 15 నుంచి 17 వరకు నిర్వహించనున్నారని పేర్కొన్నారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు లంకా కృష్ణమూర్తి, ఎమ్మెస్ రాజు, జయవర్ధన్, హిమబిందు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు.. ఆదాయ మార్గాలు

- వరి విస్తీర్ణం పెరిగే అవకాశం
- మినుము, పెసర సాగు మేలంటున్న శాస్త్రవేత్తలు


సాగులో ఉన్న పెసర పంట

పొదలకూరు : రైతులు ఆధునిక పద్ధతుల్లో సాగు చేయడంతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగు వల్ల ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. సాగునీటి కాలువ లేకుండా వరి పండించలేని రైతులు మెట్ట వ్యవసాయానికి అదను ఉందంటున్నారు. నవంబర్ 15 నుంచి డిసెంబర్ 15 వరకు పెసర, ఉలవ, నువ్వు సాగు చేసుకోవచ్చని వెల్లడిస్తున్నారు. నవంబర్, డిసెంబర్ మొదటి వారం వరకు వర్షాల పరిస్థితిని పరిశీలించి తర్వాత కూడా పప్పుధాన్యాల సాగు చేసుకునేందుకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నట్లు చెబుతున్నారు. ఇప్పటికే సాగులో ఉన్న మినుము, పెసర పంట సాగులో మెళకువలను పాటించాల్సిందిగా కోరుతున్నారు. పొదలకూరు ప్రాంతంలో రబీలో వరి విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. సోమశిల నిండుకుండలా ఉండడం, కండలేరు జలాశయానికి సోమశిల నుంచి నీరు విడుదలవుతున్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో జలాశయాలకు అనుసంధానంగా ఉన్న కాలువల ద్వారా సుమారు 14 వేల ఎకరాల్లో వరినాట్లు పడే అవకాశం ఉంటుందని వ్యవసాయాధికారులు వెల్లడించారు. పొదలకూరు పరిసర ప్రాంతాలు, వెంకటగిరి చుట్టుపక్కల గ్రామాల్లో పెసర, మినుము పంటలను రైతులు సాగు చేస్తున్నారు. డిసెంబరు 15 నుంచి కూడా పెసర, ఉలవ, నువ్వుల పంటలను సాగు చేసుకోవచ్చని తెలియజేస్తున్నారు. మినుము, పెసరకు పొగాకు లద్దెపురుగు, పల్లాగు తెగులు, మారుకామచ్చల పురుగు ఆశిస్తున్నట్లు తెలిపారు.

తెగుళ్ల నివారణ చర్యలు

పల్లాగు తెగులును నివారించేందుకు కలుపు మొక్కలను పీకి నాశనం చేయాలి. తెగులు సోకిన మొక్కలను తొలిదశలో గుర్తించి పీకి తగులబెట్టాలి. తెల్లదోమ ద్వారా పల్లాగు తెగులు వ్యాప్తి చెందుతుందని, దోమల నివారణకు ట్రైజోఫాస్ 1.5 మిల్లీలీటర్, లేదా ఎసిఫేట్ ఒక గ్రాములు లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా మోనో క్రోటోఫాస్ 2.0 మి.లీను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పొగాకు లద్దె పురుగు నివారణకు జల్లెడగా పిల్ల పురుగులు ఉన్న ఆకులను ఏరి నాశనం చేయాలి. ఒక లీటరు నీటికి 5 మి.లీ వేపనూనె లేదా 5 శాతం వేపగింజల కషాయాన్ని కలిపి పిచికారీ చేసి, గుడ్లు పెట్టకుండా నివారించాలి. ఉధృతి అధికంగా ఉన్న సమయంలో విషపు ఎరలను ఎకరాకు 5 కిలోల తవుడు, అర కిలో బెల్లం, 500 మి.లీ మోనోక్రోటోఫాస్ కలిపి ఉండలుగా చేసి పొలంలో అక్కడక్కడా వెదజల్లాలి. మారుకామచ్చల పురుగు నివారణకు పైరు పూతదశలో ఉంటే 5 శాతం వేపగింజల కషాయాన్ని లేదా 5 మి.లీ వేపనూనెను ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. రెక్కల పురుగులను గుడ్లు పెట్టకుండా నివారించుకోవాలి. పిల్ల పురుగులు కనిపిస్తే క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ లేదా థయోడికార్బ్ ఒక గ్రాము లేదా ఎసిఫేట్ గ్రామును ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

చీడపీడలను తట్టుకునే 'వీబీఎన్ – 8'

మినుములో ఎల్లో మొజాయిక్(తెల్లదోమ, పేనుబంక తెగులు)ను తట్టుకునే వీబీఎన్–8 రకం విత్తనాలను వ్యవసాయాధికారులు రైతులకు అందజేశారు. మెట్టపొలాలు ఉన్న ప్రతి రైతుకు నాలుగు కిలోల బ్యాగును ఉచితంగా అందజేసినట్లు చెప్పారు. రైతులు కొత్తగా తెగుళ్లను ఎదుర్కొనేందుకు వీబీఎన్–8 రకం మినుము విత్తనాలను సాగు చేసి చూడాలంటున్నారు. నిమ్మతోటలు ఎక్కువగా ఉన్న రైతులు అంతర్‌పంటగా వీటిని సాగు చేసి పరిశీలించాల్సిందిగా సూచించారు. తెగుళ్లను తట్టుకుని నిలబడితే వచ్చే ఏడాది కూడా ఇదే రకం విత్తనాన్ని విత్తుకోవచ్చని సలహా ఇస్తున్నారు.


పురుగుతో ఉన్న జల్లెడ ఆకులు


మారుకామచ్చల పురుగు సోకిన ఆకులు(ఫైల్)

చీడపీడలను వెంటనే గుర్తించాలి



ప్రధానంగా మెట్ట పంటలను సాగు చేసే రైతులు చీడపీడలను వెంటనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలి. లేకుంటే దిగుబడి తగ్గి తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. మినుము, పెసర సాగు చేస్తున్న రైతులు తెల్లదోమ, పేనుబంకతో పాటు, పొగాకు లద్దెపురుగు వంటి తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి. వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు మాత్రమే తీసుకోవాలి.

– దేగపూడి కోదండరామిరెడ్డి, విశ్రాంత శాస్త్రవేత్త, నెల్లూరు

లక్ష దీపోత్సవానికి నగదు అందజేత



పొదలకూరు: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని స్థానిక శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించనున్న లక్ష దీపోత్సవానికి పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు జయలక్ష్మి రూ.పది వేలను శుక్రవారం అందజేశారు. దేవస్థాన నిర్వాహక సభ్యులు దాసరి శ్రీనివాసులు, మందా రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ల్యాబ్ ప్రారంభం



వెంకటాచలం: మండలంలోని గుడ్లూరువారిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ ల్యాబ్‌ను ఎస్సార్కే స్కూల్స్ అధినేత కృష్ణమూర్తి చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలకు తమ వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో రూ.50 వేలను వెచ్చించి సైన్స్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామని వెల్లడించారు. విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కాంక్షించారు. ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణరాజు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల అభివృద్ధికి నిధులు కేటాయించాలి


వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఆవాజ్ నేతలు

తోటపల్లిగూడూరు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా ముస్లింల అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్లో నిధులను కేటాయించాలని ఆవాజ్ మండల కార్యదర్శి మస్తాన్ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ముస్లిం యువతకు విదేశీ విద్య, దుల్హన్ పథకం ద్వారా రూ.లక్ష కేటాయింపు, రూ.ఐదు లక్షల వరకు సబ్సిడీ రుణాలు, ఇమామ్, మౌజన్లకు ప్రతి నెల జీతాలు తదితర హామీలను ఇచ్చిన అంశాన్ని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చి ఐదు నెలలవుతున్నా, నేటికీ దేన్నీ అమలు చేయలేదని చెప్పారు. మైనార్టీ నేత ఎస్డీ బాబు, భూ పోరాట కమిటీ సభ్యులు ఈదూరు వెంకటయ్య, ఇంగిలాల పెంచలయ్య, సీపీఎం నేతలు బండి శౌరి, మారుబోయిన రాజా తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారమే ధ్యేయం


అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం: సర్వేపల్లి నియోజకవర్గంలోని గిరిజనుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలనే లక్ష్యంతో గిరిజనుల ప్రత్యేక ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని గిరిజనుల ప్రత్యేక ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని చెముడుగుంటలోని స్రిడ్స్ కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించారు. అర్జీలను కలెక్టర్ ఆనంద్, కమిషనర్ సూర్యతేజతో కలిసి ఎమ్మెల్యే స్వీకరించారు. ఆన్‌లైన్లో అర్జీల నమోదు కోసం 15 ప్రత్యేక కౌంటర్లు, ఆధార్ కార్డుల నమోదు కోసం ఐదు కౌంటర్లు, 25 మంది సచివాలయ ఉద్యోగులతో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో కోటి సోమవారం



పొదలకూరు: పట్టణంలోని కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో కోటి సోమవార పూజలను మహిళలు భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రమిదలను వెలిగించారు. ఆకాశ దీపంలో నూనె పోసి ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమాలను దేవస్థాన ప్రధానార్చకుడు ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

- మండలంలోని చెన్నారెడ్డిపల్లిలో గల పంచలింగేశ్వరస్వామి ఆలయం, మరుపూరులోని కామాక్షి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానాల్లో పూజలు చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన


మాట్లాడుతున్న వేణుగోపాల్‌రెడ్డి

మనుబోలు: ప్రైవేట్ పాఠశాలలతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యాబోధన ఉంటుందని ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మనుబోలులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. శిక్షణ పొందిన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉంటారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాల వద్ద చికెన్, చేపల దుకాణాలను నిర్వహిస్తే చర్యలు తప్పవని చెప్పారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. సీఆర్పీ జయరామయ్య పాల్గొన్నారు.

స్కిల్ సర్వే నుంచి మినహాయించండి


ఎంపీడీఓకు విన్నవిస్తున్న ఏఎన్‌ఎంలు

ఇందుకూరుపేట : స్కిల్ సర్వే నుంచి తమను మినహాయించాలని కోరుతూ మండలంలోని సచివాలయ ఏఎన్‌ఎంలు శుక్రవారం ఎంపీడీఓ నాగేంద్ర బాబుకు ఆయన కార్యాలయంలో విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే తమ శాఖకు సంబంధించి జాబ్‌చార్ట్, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు సోమ, గురువారాలు అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీంతో ఆపటు బుధ, శనివారాలు చిన్నారులు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు, శుక్రవారం శానిటేషన్, ఫీవర్ సర్వేలు వంటి కార్యక్రమాలను విధిగా నిర్వహిస్తున్నామన్నారు. ఇలాంటి సమయంలో కూడా ప్రభుత్వ ఆదేశాల మేరకు పింఛన్ల పంపిణీని చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇతర శాఖలకు సంబంధించిన స్కిల్ సర్వే నుంచి తమను మినహాయించాలని ఏఎన్‌ఎంలు కోరారు. కార్యక్రమంలో ఏపీ హంస నాయకులు ధనలక్ష్మి, రాజ్యలక్ష్మి, సుజాత, యానదమ్మ, సునీల, హుస్నా, జయలక్ష్మి, విజయలక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే మద్యాన్ని విక్రయించాలి

ముత్తుకూరు: ఎమ్మార్పీకే మద్యాన్ని విక్రయించాలని ఇందుకూరుపేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మద్యం దుకాణాల ఎదుట ధరల పట్టికను ఏర్పాటు చేయాలని సూచించారు. ముత్తుకూరు, ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు మండలాల పరిధిలో 18 మద్యం దుకాణాలను నిర్వహిస్తున్నారని, అక్రమంగా విక్రయాలు జరిపితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

నేటి నుంచి ప్రత్యేక ప్రచార దినాలు

ముత్తుకూరు: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారం, ఈ నెల 23, 24వ తేదీల్లో ప్రత్యేక ప్రచార దినాలను నిర్వహించనున్నామని తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితాతో పాటు ఫారం 6, 7, 8ను అందుబాటులో ఉంచుతామని వివరించారు. ఓటర్లు తమ పేర్లు జాబితాలో ఉన్నాయో, లేవో పరిశీలించుకోవచ్చని చెప్పారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

కోవూరు : మండలంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆ శాఖ డీఈ కె.మధుసూదన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. పాటూరు, ఇనమడుగు, వేగూరు, లేగుంటపాడు, కోవూరు టౌన్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

భూముల పరిహారంపై నివేదిక అందజేస్తాం


భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ అనూష

పొదలకూరు: నడికుడి – శ్రీకాళహస్తి రైల్వే లైన్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు పరిహార విషయమై కలెక్టర్‌కు నివేదికను అందజేయనున్నామని ఆర్డీఓ అనూష పేర్కొన్నారు. మండలంలోని వావింటపర్తిలో సేకరించిన భూములను రైతులతో కలిసి శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. మెట్ట భూములకు రూ.3.97 లక్షలు, మాగాణి భూములకు రూ.6.53 లక్షలను పరిహారంగా నిర్ణయించారని తెలిపారు. అయితే కండలేరు ఆయకట్టు కింద ఉన్న భూములు కావడంతో మెట్టా, మాగాణి అనే తేడా లేకుండా పరిహారాన్ని నిర్ణయించాలని కోరారు. 2020లో సేకరించిన భూములకు సర్వే రాళ్లు నాటారని, అప్పటి నుంచి వడ్డీని కలిపి పరిహారంగా అందజేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా గతంలోనే ధరలను నిర్ణయించారని, రైతుల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకొని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఆర్డీఓ హామీ ఇచ్చారు. మెట్ట 22.90 ఎకరాలు.. మాగాణి 2.87 ఎకరాలను రైతుల నుంచి సేకరించామని వివరించారు. తహసీల్దార్ శివకృష్ణ, వీఆర్వో సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అధికారులకు సూచించారు. బుచ్చిరెడ్డిపాళెం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. పేదల ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాకుండా బిల్లులు డ్రా చేసిన కాంట్రాక్టర్లను గుర్తించి రికవరీ చేయాలన్నారు. బుచ్చి సీహెచ్‌సీలో రాత్రి సమయంలో డాక్టర్లు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీహరి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీదీప, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలని వినతి



బుచ్చిరెడ్డిపాళెం : ముస్లిం మైనారిటీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించాలని బుచ్చిరెడ్డిపాళెం మండల ఆవాజ్ కమిటీ కోరింది. ఈ మేరకు వారు రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా ఉపాధ్యక్షుడు జానీబాషా, మండల అధ్యక్ష, కార్యదర్శులు జక్రియ, మునీర్, సభ్యులు షరీఫ్, గౌస్‌బాషా, అల్లాభక్షు, షబ్బీర్, షఫీ, రసూల్, నాగూర్‌బాషా, నజీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కార్లు ఢీకొని నలుగురికి గాయాలు


గాయపడిన మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న అంబులెన్స్ సిబ్బంది


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

కొడవలూరు : రెండు కార్లు ఢీకొనగా నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని చంద్రశేఖరపురం వద్ద శుక్రవారం చోటుచేసుకొంది. పెయ్యలపాళెంలోని తవుడు ఫ్యాక్టరీ యజమాని సంజయ్, తన సతీమణితో కలిసి నెల్లూరులోని నివాసానికి వెళ్లేందుకు కారులో బయలుదేరారు. చంద్రశేఖరపురం క్రాసింగ్ వద్ద వేగంగా హైవే పైకి రావడంతో నెల్లూరు నుంచి కావలి వైపు వేగంగా వెళ్తున్న మరో కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సంజయ్, ఆయన సతీమణి గాయపడడంతో పాటు మరో కారులోని ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. నలుగురికి ఎలాంటి ప్రాణపాయం లేదని వైద్యులు తెలిపినట్లు బాధితుల బంధువులు తెలిపారు. ఈ ప్రమాదంపై సమాచారం అందాల్సి ఉందని ఎస్సై కోటిరెడ్డి తెలిపారు.

స్మార్ట్‌మీటర్లతో పేదలకు నష్టం


కొడవలూరు : నార్తురాజుపాళెంలో ర్యాలీ చేస్తున్న సీపీఎం నాయకులు


కోవూరు : గంగవరంలో..

కొడవలూరు : ప్రభుత్వం శరవేగంగా స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేస్తోందని, వీటివల్ల పేదలకు తీరని నష్టమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గోనె దయాకర్ అన్నారు. మండలంలోని నార్తురాజుపాళెంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ర్యాలీ చేపట్టారు. స్మార్ట్‌మీటర్లతో ముందుగా నగదు చెల్లిస్తే విద్యుత్ ఇస్తారని, పేదలు ముందే డబ్బు వెచ్చించి కొనుగోలు చేసే వెసులుబాటు లేక అంధకారంలో ఉండాల్సి ఉంటుందన్నారు. ఈ స్మార్ట్‌మీటర్‌ల ప్రక్రియను ప్రభుత్వం వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. అమాంతం పెరిగిన నిత్యావసరాల ధరలను వెంటనే అదుపు చేయాలని, లేనిపక్షంలో ఈనెల 14న ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు వి.దేవానంద్, టి.నరసింహం, ఎస్.సామియేలు, డి.చంద్రశేఖర్, కె.హరి, జె.శ్రీహరి పాల్గొన్నారు.

వెంటనే ఆపాలి

కోవూరు : ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో అదానీ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా ప్రతి ఇంటికి విద్యుత్ స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేస్తోందని, దీనిని వెంటనే ఆపాలని సీపీఎం జిల్లా నేత జొన్నలగడ్డ వెంకమరాజు డిమాండ్ చేశారు. మండలంలోని గంగవరంలో వారు శుక్రవారం నిరసన ర్యాలీ చేపట్టారు. విద్యుత్ సబ్సిడీని ఎత్తివేసేందుకు స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆరోపించారు. దీనిపై ప్రభుత్వం వెనక్కు తగ్గాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గండవరపు శేషయ్య, బుజ్జయ్య, బాబు, శ్రీనివాసులు, సర్దార్, రమేష్, మల్లికార్జునరెడ్డి, సురేష్, విజయ్, ఫాతిమ తదితరులు పాల్గొన్నారు.